క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ కాలనీల వాసులతో ఆదివారం ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో సాయంత్రం 4 గంటలకు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ ఫ్లోర్ లీడర్ భూపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి మంత్రి సబితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కాలనీల ప్రజలు పాల్గొనాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: మండలంలోని కొత్తగూడ గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బాలాపూర్‌కు చెందిన కొలన్ శంకర్‌రెడ్డి విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సర్పంచ్ మల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎల్లారెడ్డికి రూ. 75 వేల విలువ చేసే చెక్కును శనివారం తన నివాసంలో అందజేశారు.

వర్షానికి కూలిన ఇళ్లు



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్, బీఆర్‌ఎస్ నేత

తలకొండపల్లి: వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వెల్జాల్‌లో ఇళ్లు కూలిపోయాయి. గ్రామానికి చెందిన మంద శాంతమ్మ, కుమ్మరి వెంకటయ్య ఇళ్లు కూలిపోయాయి. శుక్రవారం సాయంత్రం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసుయాదవ్‌తో కలిసి తహసీల్దార్ కృష్ణ గ్రామంలో పర్యటించి ఇళ్లను పరిశీలించారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి శరత్‌కుమార్, వార్డు సభ్యులు యాదయ్య, కారోబార్ రవి, మోహన్, సుధాకర్, శ్రీశైలం పాల్గొన్నారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయండి

దిల్‌సుఖ్‌నగర్: వర్షాలకు డివిజన్‌లోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, వ్యాధులు ప్రబలకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ ఎ. రాధా ధీరజ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురంలో డివిజన్‌లోని ఎన్‌టీఆర్‌నగర్, మార్గదర్శి కాలనీ తదితర కాలనీల్లో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. కాలనీల్లో ఎక్కడా డ్రైనేజీలు పొంగకుండా చర్యలు తీసుకోవాలని, కాలనీలలో చెత్త, బురద లేకుండా చూడాలని అధికారులను కోరారు. కాలనీలలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కాలనీల సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి



పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

ఆమనగల్లు: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఆమనగల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టులు ఎంతో కీలకపాత్ర పోషించారని అన్నారు. జర్నలిస్టులకు ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హామీలను అమలుచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆనంద్‌కుమార్, నిరంజన్, శేఖర్, యూనిస్, నరేశ్, అజీం, రవి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న కల్యాణం



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

తలకొండపల్లి: మండలంలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని రంగు రంగుల పూలు, విద్యుదీపాలంకరణతో అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణాల మధ్య ముత్యాల తలంబ్రాలతో మంగళ సూత్రధారణ చేశారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

మహేశ్వరం: మత సామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అమీర్‌పేట్, నందుపల్లి, మన్సాన్‌పల్లి, పెండ్యాల, దుబ్బచర్ల, మహేశ్వరం, పోరండ్ల, నాగారం గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. హిందువులు, ముస్లింలు పీర్లకు దట్టీలు, ఊదు, బెల్లం, కొబ్బరి దండాలు, పూలు సమర్పించారు. ప్రజలు సంతోషంగా ఉండాలని అల్లాను ప్రార్థించారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు శ్రీశైలం గౌడ్, కళావతి, సంధ్య, లావణ్య, అరుణ, ఉప సర్పంచులు నర్సింగ్, ఉస్మాన్, గౌస్, నర్సింహ యాదవ్, ఎంపీటీసీలు కుమారి, వెంకటేష్ పాల్గొన్నారు.

కందుకూరు మండలంలో..

కందుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పీర్లకు ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపు నిర్వహించారు. ముస్లింలు, హిందువులు ఈ వేడుకలో పాల్గొన్నారు. దాసర్లపల్లిలో వేడుకల్లో ఎంపీటీసీ ఇందిర, మాజీ సర్పంచ్ దేవేందర్, నేదునూరులో కాంగ్రెస్ నాయకులు ఎండీ అఫ్జల్‌బేగ్, శ్రీధర్, నవీన్, ఆంజనేయులు, ఎండీ ఉస్మాన్, సోహాల్ బేగ్, అమేర్ బేగ్, జహంగీర్, మున్వర్, పర్వేజ్, రఫీక్, హాజీ, అన్వార్‌బేగ్ పాల్గొన్నారు.



మీర్‌పేట: జిల్లెలగూడలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీలో శనివారం మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే పీర్లను కాలనీల్లో ఊరేగించారు. భక్తులు దట్టీలు, పూలు, మలీదా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలో స్థానికులు మల్లయ్య యాదవ్, దయానంద్, శ్రీశైలం, మహేష్, అజ్జు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలో శనివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేట, నాదర్‌గుల్, వెంకటాపూర్, మల్లాపూర్, కొత్తపేట్, కుర్మల్‌గూడ ప్రాంతాల్లో పీర్లు నిలబెట్టి ఆయా స్థానికులు అలయ్ బలయ్ ఆడుకున్నారు. గ్రామ పెద్దలు, మొక్కుబడులు ఉన్నవారు పీర్లకు దట్టీలు, చాదర్లు, కొబ్బరి బెల్లాలను సమర్పించారు. కాలనీల్లో పీర్లను ఊరేగించారు.



మహేశ్వరం: నందుపల్లిలో పీర్ల ఊరేగింపు



బడంగ్‌పేట్: నాదర్‌గుల్‌లో కొలువుదీరిన పీర్లు



కందుకూరు: నేదునూరులో..

అదృశ్యం.. కథ సుఖాంతం

ఇంటికి చేరిన అన్నదమ్ములు

యాచారం: తల్లిదండ్రులు చదువుకోమని ఒత్తిడి చేస్తున్నారని, ఇంటి నుంచి పారిపోతే చదివే ఇబ్బంది ఉండదని భావించిన ఆ అన్నదమ్ములు ఇంట్లోని నగదు తీసుకుని బయటకు వెళ్లారు. నాటకీయ పరిస్థితుల్లో వీరిని గుర్తించిన పోలీసులు.. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. మాల్ గ్రామానికి చెందిన శ్రీను, రేణుక దంపతుల ఇద్దరు కుమారులు(13, 11 ఏళ్లు).. శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోని రూ.80 వేల నగదు తీసుకుని బయటకు వెళ్లిపోయారు. ఎంజీబీఎస్‌లో బస్ ఎక్కి మెదక్ సమీపంలోని ఓ గ్రామంలో దిగారు. ఇక్కడ విక్రయిస్తున్న చిలుక బొమ్మలు కొనుగోలు చేసే సమయంలో అనుమానం వచ్చిన ఓ వ్యక్తి 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాడు. అప్పటికే తమ కుమారుల అదృశ్యంపై బాధిత తల్లిదండ్రులు యాచారం పీఎస్‌లో ఫిర్యాదు చేయడం.. ఈ విషయాలన్నీ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో మెదక్ పోలీసులు వచ్చి ఇద్దరినీ తమ సంరక్షణలోకి తీసుకున్నారు. వెంటనే తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకుడు చిన్నోళ్ల యాదయ్య సహకారంతో శుక్రవారం రాత్రి మెదక్ బయల్దేరిన బాలుర తల్లిదండ్రులు వారిని తీసుకుని తెల్లవారుజామున ఇంటికి చేరుకున్నారు. ఏది ఏమైనా తమ పిల్లల ఆచూకీ దొరకడంపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేశారు.

నాణ్యత ప్రమాణాలు పాటించండి

మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్ ద్వారక హిల్స్ కాలనీలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్, 29వ డివిజన్ గాంధీనగర్‌లో మహిళా భవన్ నిర్మాణ పనులను శనివారం మేయర్ పారిజాత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ పారిజాత, కార్పొరేటర్ సంతోషిని కాలనీ మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ శ్రీనివాస్‌రెడ్డి, కాలనీవాసులు పురందేశ్వర్, సునీల్ పాల్గొన్నారు.



మేయర్ పారిజాత, కార్పొరేటర్ సంతోషిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

పండుగ సాయన్న విగ్రహాన్ని ప్రతిష్ఠించాలి

ఇబ్రహీంపట్నం: పండుగ సాయన్న విగ్రహాన్ని ట్యాంక్ బ్యాండ్‌పై ప్రతిష్ఠించాలని ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భిక్షపతి డిమాండ్ చేశారు. పండుగ సాయన్న 134 జయంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో శనివారం నిర్వహించారు. సాయన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం భిక్షపతి మాట్లాడుతూ.. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా సాయన్న పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్, మండల అధ్యక్షుడు లింగం పాల్గొన్నారు.

బండి సంజయ్ నియామకంపై హర్షం

తలకొండపల్లి: రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు పార్టీ అధిష్ఠానం కీలక పదవీ కట్టబెట్టింది. ఆయనను జాతీయ కార్యవర్గంలోకి తీసుకుంది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి నీలకంఠం పాండు శనివారం హర్షం వ్యక్తం చేశారు. బండి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలిపారు.

పోరాటం ఆగదు

కాంగ్రెస్ నేత డేవిడ్

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం సాధించే వరకు పోరాటం ఆగదని కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్ స్పష్టం చేశారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు శనివారానికి 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం 27 రోజులుగా దీక్ష చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. మండలం ఏర్పాటు చేయాలని ఇటీవల సర్పంచ్, ఉప సర్పంచ్‌లతో పాటు, వార్డు సభ్యులందరూ తమ పదవులకు రాజీనామా చేశారని గుర్తుచేశారు. అయినా ప్రభుత్వంతో ఏ మాత్రం చలనం లేదని తప్పుబట్టారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ నాయకులు రేణురెడ్డి, మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, చెన్నయ్య, రాజేందర్, రాజు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెల మృతి

మహేశ్వరం: విద్యుత్ షాక్‌కు గురై మూడు పాడిగేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని ఆకన్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్టుపల్లికి చెందిన రైతు కొమురయ్య యాదవ్ పాడి గేదెలతో జీవనం సాగిస్తున్నాడు. ఉదయం గేదెలను మేత కోసం ఆకన్‌పల్లిలోని ఓ వెంచర్‌లోకి తోలుకెళ్లాడు. అక్కడ తెగి పడిన విద్యుత్ తీగలను మూడు గేదెలు తాకి చనిపోయాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం చోటు చేసుకుందని బాధిత రైతు ఆరోపించారు. చనిపోయిన గేదెల విలువ రూ. 3 లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కొమరయ్య కోరారు.



విద్యుత్ షాక్‌కు గురై చనిపోయిన గేదెలు

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెడిపోయిన రోడ్లు, డ్రైనేజీలకు తక్షణమే అధికారులు మరమ్మతులు చేపట్టాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ కోరారు. శనివారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్‌ఎన్‌క్లేవ్ కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న బాక్స్ డ్రెయిన్ పనులను సత్వరమే పూర్తి చేసి ఉంటే ముంపు సమస్య వచ్చి ఉండేది కాదని, వెంటనే అధికారులు పనులను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈ కనకయ్య, ఏఈ హేమూనాయక్, కాలనీ ప్రతినిధులు ఈదులకంటి సత్యనారాయణరెడ్డి, మమత, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజు పాల్గొన్నారు.

కేసీఆర్ సారూ.. మేం ఏంపాపం చేశాం?



మంచాలలో పీర్లను వేడుకుంటున్న జీపీ కార్మికులు

యాచారం: ''ముఖ్యమంత్రి కేసీఆర్ సారూ... మేం ఏం పాపం చేశాం. పారిశుద్ధ్య పనుల్లో ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పని చేస్తున్నాం. మా బాధను గుర్తించి వెంటనే పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించాలి'' అని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా శనివారం యాచారం గ్రామ పంచాయతీ ఎదుట పంచాయతీ సిబ్బంది ధర్నా చేశారు. తమను ఉద్యోగాలను పర్మినెంట్ చేసి.. నెలకు రూ. 19,500 జీతం ఇవ్వాలని కోరారు. జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారానికి 24వ రోజుకు చేరింది.

24వ రోజుకు చేరిన సమ్మె

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె శనివారం 24వ రోజుకు చేరింది. ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ కార్యాలయ వద్ద నిర్వహిస్తున్న సమ్మెను ఉద్దేశించి ఆ సంఘం నాయకులు దేవదాసు, బుగ్గ రాములు, యాదయ్య, మల్లేష్, భాస్కర్‌లు మాట్లాడుతూ.. జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్మికులు 'పీర్లకు' వినతి

మంచాల: పంచాయతీ కార్మికులు వినూత్నంగా నిరసన చేపట్టారు. తమ సమస్యలను పరిష్కారించే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌లో మార్పు తీసుకుని రావాలని జీపీ కార్మికులు పీర్లను వేడుకున్నారు. శనివారం మంచాల మండల కార్యాలయం వద్ద 24వ రోజు సమ్మెకు దిగారు. మొహర్రం సందర్భంగా పీర్లను తయారు చేసి ఆటలాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, జీపీ కార్మిక సంఘం నాయకులు పాష, భాస్కర్, రవి, చెన్నయ్య, అంజయ్య, దాసు, నర్సింహ, మల్లేష్, నరేశ్, జంగయ్య, రోశమ్మ, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శేరిగూడలో మళ్లీ చిరుత కలకలం

- పులి సంచరిస్తున్న ప్రాంతాల్లో అధికారుల పర్యటన
- ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లొద్దని డీఆర్‌ఓ ఇంద్రసేనారెడ్డి సూచన

ఇబ్రహీంపట్నం రూరల్: చిరుత సంచరించే ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి ఇంద్రసేనారెడ్డి ప్రజలకు చెప్పారు. కొద్ది రోజులుగా శేరిగూడ, మల్సెట్టిగూడ ప్రాంతాల్లో చిరుత సంచరిస్తుందని ప్రజలు భయాందోళన పడుతున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం సీఐ రామకష్ణ, పారెస్టు డిప్యూటీ రేంజ్ అధికారి పర్యటించారు. పొలాల్లో పనిచేస్తున్న రైతులకు అవగాహన కల్పించారు. గతంలో చిరుత సంచరించిందని ప్రజలు చెప్పిన బస్వన్నగుట్ట, పులందరి చెక్‌డ్యాం ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడారు. ఆటవీ ప్రాంతంలో ఆడవి జంతువులు సంచరిస్తుంటాయని, ప్రజలు ఒంటరిగా వెళ్లకూడదని హెచ్చరించారు. తప్పని సరిగా చేతుల్లో కర్రలు పట్టుకొని వెళ్లాలని సూచించారు. చిరుతో, హైనో తప్పకుండా గుర్తిస్తామన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఆటవీ ప్రాంతంలో సంచరించే జంతువు ఏది అన్నది త్వరలోనే తెలుస్తామన్నారు. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మళ్లీ కనిపించింది

శనివారం ఉదయం ఓ ఆటోకు చిరుత అడ్డం వచ్చిందని తెలిపారు. అలాగే 11 గంటల సమయంలోనూ ఓ రైతు వ్యవసాయ పొలం వద్ద అటు నుంచి వెళ్లిందని చెప్పారు. వెంట వెంటనే ఒకే ప్రాంతంలో చిరుత కనిపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు చిరుతను పట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పార్కులో మొక్కలు తొలగించిన వారిపై కేసు

హస్తినాపురం: పార్కులోని మొక్కలను జేసీబీలతో తొలగించిన వ్యక్తులపై వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలోని పార్కులోకి శనివారం ఉదయం కొంత మంది జేసీబీలతో అక్రమంగా ప్రవేశించి చెట్లను తొలగించారని కాలనీకి చెందిన సెంటర్ ఫర్ సోషియో కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ సీఈఓ సన్నీ హెరాక్లియస్ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



టీచర్స్ కాలనీలోని పార్కులో మొక్కలను తొలగించిన దృశ్యం

బీఆర్‌ఎస్‌వి మోసపూరిత వాగ్దానాలు



కాలనీవాసులకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సామ రంగారెడ్డి

లింగోజిగూడ: బీఆర్‌ఎస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలతో పాలన చేస్తున్నదని రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన లింగోజిగూడ డివిజన్‌లోని ఎస్‌బీహెచ్ కాలనీ, కాకతీయనగర్‌ల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. కాలనీలవాసులకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, లింగోజిగూడలో 20 ఏళ్ల క్రితం వేసిన పైప్‌లైన్ల కారణంగా సమస్యలు వస్తున్న పట్టించుకోవడం లేదని, ఎండాకాలంలో చేపట్టాల్సి పూడికతీత పనులను అధికారులు వర్షకాలంలో చేయిస్తున్నారన్నారు. లింగోజిగూడ నగరంలోనే అత్యంత ముంపు ప్రాంతం, చిన్నపాటి వర్షాలకే ప్రజలు ఇబ్బంది పడతారని తెలిసి కూడా ముందస్తు చర్యలు తీసుకోకుండా అలసత్వం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి మంజూరైన సీడీఎఫ్ నిధులపై ఎమ్మెల్యే శ్వేత పత్రం విడుదల చేయాలని రంగారెడ్డి డిమాండ్ చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, శ్రీనివాస్, రాకేష్‌యాదవ్, కృష్ణగౌడ్, కృష్ణం రాజు, హరిప్రసాద్, వీరేశంగుప్తా, మల్కాజిగిరి నాగరాజు, భాస్కర్‌రావు, రాజ్ విలక్షణ్, ప్రశాంతి పాల్గొన్నారు.



అలుగు పారుతున్న కోళ్లపడకల్ ఫతేసాగర్ చెరువు



పహాడీషరీఫ్: కళకళలాడుతున్న జల్‌పల్లి చెరువు

నిండుకుండల్లా చెరువులు

మహేశ్వరం: పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండు కుండల్లా మారాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలోని 120కి పైగా చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో పెద్ద చెరువులు కోళ్లపడకల్ ఫతేసాగర్ చెరువు, రావిర్యాల పెద్ద చెరువు, కల్వకోల్ పెద్ద చెరువు, బాగ్ మంఖాల్ పెద్ద చెరువు, కొత్వాల్ చెరువు, అమీర్‌పేట్, గొల్లూరు, నల్ల చెరువు, తుమ్మలూరు చెరువు, ఘట్టుపల్లి చెరువు ఉన్నాయి. కల్వకోల్ పెద్ద చెరువు, కోళ్లపడకల్ ఫతే సాగర్ చెరువులు నిండి అలుగు పారి మత్తడి దుంకుతున్నాయి.

'గొలుసుకట్టు'తో జలకళ

పహాడీషరీఫ్: పది రోజులుగా కురుస్తున్న వర్షాలతో జల్‌పల్లి పరిధిలోని గొలుసుకట్టు చెరువులకు జలకళ సంతరించుకుంది. మున్సిపాలిటీ కార్యాలయం వెలుపల ఉన్న తాళ్లకుంట నుంచి జల్‌పల్లి పెద్ద చెరువుకు అక్కడి నుంచి అలుగు పారి దిగువన ఉన్న కొచ్చెరువు నుంచి పల్లె చెరువుకు మూడు రోజులుగా పెద్ద ఎత్తున వరద కొనసాగుతోంది. పల్లె చెరువు నుంచి దిగువన ఉన్న బండ్లగూడ నాలా మీదుగా ఫలక్‌నుమా, ఉప్పుగూడ నల్లవాగు నాలా మీదుగా మూసిలోకి నీరు చేరుతోంది.



మత్తడి దుంకుతున్న కల్వకోల్ చెరువు



నీటితో కళకళలాడుతున్న కొత్వాల్ చెరువు